విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

సోమవారం 05 ఆగస్టు 2024 8 పేజీలు

తూకాలు...కొలతల్లో మోసం

- నిత్యం మోసపోతున్న వినియోగదారులు
- పత్తాలేని తూనికలు, కొలతల శాఖ అధికారులు
- దాడులకు దూరం.. మామూళ్లకు అలవాటు
- అడ్డగోలుగా దోచేస్తున్న వ్యాపారులు
- సిబ్బంది కొరతతో శాఖకు ఇబ్బందులు

విశాలాంధ్ర-పీసీపల్లి : కాసుల దాహంతో వ్యాపారులు చేస్తున్న మోసం కళ్లు మూసుకొని నిద్ర నటిస్తున్న అధికారుల నిర్లక్ష్యం వెరసి వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. నిత్యావసరాల వస్తువుల తూకాల్లో పట్టు తప్పుతున్నా.. వ్యాపారుల మోసాలను నియంత్రించేందుకు చట్టాలున్నా ప్రజల్లో అవగాహన కొరవడడం అవరోధంగా మారింది. ఎవరికి వారే తమకెందుకు అనే ధోరణిలో ఉండటం వల్ల వ్యాపారులు విచ్చలవిడిగా దోచుకుంటున్నారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో కొలతల్లో మోసాలకు పాల్పడే వ్యాపారులు మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నారు.

వివరాల్లోకి వెళితే పిసిపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి సమీప మార్కెట్‌లో రెండుకిలోల పండ్లు కొనుగోలు చేశాడు. బరువు తక్కువగా ఉందనే అనుమానంతో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌లో తూకం వేశాడు. రెండుకిలోల వద్ద 300 గ్రాములు తక్కువగా వచ్చింది. పండ్ల వ్యాపారిని అడిగితే తనకు సంబంధం లేదంటూ దాటవేశాడు. అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తి దుకాణానికి వెళ్లి కిలో బెల్లం తీసుకున్నాడు. అతనికి ఎందుకో అనుమానం వచ్చి మరో దుకాణంలో ఎలక్ట్రానిక్ మిషన్ పై కాటా వేయడంతో కిలోకి 150 గ్రాముల వరకూ తక్కువగా రావడంతో ఖంగుతిన్నాడు. ఇలా నిత్యం కాసుల దాహంతో వ్యాపారులు చేస్తున్న మోసాలు అన్నీ ఇన్ని కావు నిత్యావసరాల వస్తువుల తూకాల్లో పట్టు తప్పుతున్నా వ్యాపారుల మోసాలను నియంత్రించేందుకు చట్టాలున్నా ప్రజల్లో అవగాహన కొరవడడం వ్యాపారులకు అవరోధంగా మారింది.నిత్యం మనం ఎన్నో రకాల వస్తువులను కొనుగోలు చేస్తుంటాం. తూనిక లేదా కొలత

మిగతా 2 లో ...

సీపీఐని వార్డు స్థాయి నుంచి

బలోపేతం చేయాలి

- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

విశాలాంధ్ర-పామూరు : వార్డు స్థాయి నుండి భారత కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సంసిద్ధులై ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గుజ్జుల ఎల్లమందరెడ్డి భవన్‌లో పాలపర్తి మస్తాన్‌రావు అధ్యక్షతన జరిగిన మండల సమితి సమావేశమునకు ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి ప్రజా ఉద్యమాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బహిష్కరించు కోగలగాలన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో బిజెపికి ఆదరణ తగ్గుతున్న దన్నారు. దక్షిణాది రాష్ట్రాలలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి తమ బలాన్ని పెంచుకునేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాల్సిన అవసరం కమ్యూనిస్టులపై ఎంతైనా ఉందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బజరంగదళ్, విశ్వహిందూ పరిషత్ సంస్థల విశ్వరూపాలును

మిగతా 2 లో ...

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది 3 లో..

ముంపు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి

జేసీ సుబ్బారావు

విశాలాంధ్ర - కొల్లూరు : కృష్ణా నదీ తీర ప్రాంత ముంపు గ్రామాలలో వరదలకు ముందే చేపట్టాల్సిన సహాయక చర్యలపై ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సంసిద్దులు కావాలని జేసీ సుబ్బారావు అన్నారు. ఆదివారం కొల్లూరు మండల పరిధిలోని పెసర్లంకలో వరదలు సంభవించిన సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కృష్ణా నదికి రానున్న నాలుగు రోజుల వ్యవధిలో వరద నీరు వచ్చే అవకాశం ఉండటంతో ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండేలా చూసు కోవాలన్నారు. ముంపు గ్రామాల ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహ కరించి పునరావాస కేంద్రాలకు తరలిరావాలని, లేని పక్షంలో వారి బంధువుల ఇళ్లకు వెళ్లాలేకాని గ్రామాలలో ఉండటానికి వీలులేదన్నారు. గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులను ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. రేపల్లె సబ్‌కలెక్టర్ హేలా షారోన్, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ లక్ష్మికుమారి పాల్గొన్నారు.

'బోరు'మంటున్న రైతులు

- నీరు తగ్గుతుండటంతో మొరాయిస్తున్న బోర్లు
- పంటలను మధ్యలోనే దున్నేస్తున్న రైతులు

విశాలాంధ్ర-ముండ్లమూరు :

ఖరీఫ్ సీజన్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొదట్లో జూన్‌లో కురిసిన వర్షాలతో రైతాంగం వివిధ రకాల పంటలకు సిద్ధమయ్యారు. తర్వాత జూన్, జూలై, ఆగస్టు, నెలలతో పోల్చితే వర్షపాతం తక్కువగా నమోదయింది. ముందస్తుగా బోర్లను నమ్ముకొని పంటలు సాగు చేసిన రైతులు భూగర్భ జలాలు సైతం తగ్గుముఖం పట్టడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్ల నుండి భూగర్భ జలాలు పుష్కలంగా ఉండి పంటలు పండడంతో వరితోపాటు, వాణిజ్య పంటలు కూరగాయలు సైతం అధికంగా సాగు చేశారు. ఈ కోవలో పసుపుగల్లు గ్రామానికి చెందిన రైతు మేడగం శ్రీనివాసరెడ్డి నాలుగు ఎకరాలలో గోరుచిక్కుళ్లు సాగు చేశారు. ఎక్కువగా గోరు చిక్కుళ్లు ఎక్కువగా సాగు వ్యయం అయ్యాయి. ఎకరాకు రూ. 30 వేలు ఖర్చు చేశారు. నాలుగు ఎకరాలకు ఒక లక్ష ఇరవై వేల రూపాయలు ఖర్చు అయినది. ఈ తరుణంలో భూగర్భ జలాలు తగ్గి బోర్లలోనీరు అడుగంటడంతో నీరు సక్రమంగా

లేక పంటలు వాడు మొఖం పట్టింది. దీంతో రైతు ఆదివారం తన చిక్కుడు తోటనునాగలితో దున్ని వేశాడు. ప్రకృతి అనుకూలించక పోకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతు ఆవేదన చెందాడు.

చర్చిని ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర-జరుగుమల్లి : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆదివారం కొండపి నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జరుగుమల్లి మండలం కామేపల్లి అగ్రహారంలో నూతన చర్చి ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని రిబ్బన్ కట్ చేసి చర్చిని ప్రారంభించారు. చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జరుగుమల్లి మండలం చతుకుపాడు, కామేపల్లిలో తిరునాళ్లలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో కొండపి నియోజకవర్గ టీడీపీ నాయకులు, జరుగుమల్లి మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాలు సేకరణ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఇటీవల వరదలో తీవ్రంగా దెబ్బతిన్న కేరళ రాష్ట్రాన్ని ఆదుకోనేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీపీఎం మండల నాయకులు పిలుపు నిచ్చారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కేరళలో ప్రకృతి విలయంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దీంతో సీపీఎం ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలో విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోని గోగినేని బసవపున్నయ్య నల్లూరి రామారావు, సుబ్బారావు, వేంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

10న సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు సీపీఐ బాపట్ల జిల్లా కౌన్సిల్ సమావేశం మధ్యాహ్నం జిల్లా విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం సమావేశం బాపట్ల పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు.ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కారదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య,జంగాల అజయ్ కుమార్‌లు హాజరవుతారని తెలిపారు.జిల్లా కౌన్సిల్ సమావేశానికి సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని సింగరకొండ కోరారు.

రెండు బైకులు ఢీ - ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : పామూరు రోడ్డులోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొనడంతో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కోవిలంపాడు గ్రామానికి చెందిన డోలా నారాయణ పని నిమిత్తం సీఎస్‌పురం వచ్చి తిరిగి సొంత ఊరు అయిన కోవిలంపాడు వెళ్తుండగా ఎదురుగా సీఎస్‌పురం వస్తున్న క్రమంలో రెండు బైకులు ఢీ కొనడంతో కోవిలంపాడు గ్రామానికి చెందిన డోలా నారాయణకు కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన నారాయణను పామూరు వైద్యశాలకు తరలించారు. పెట్రోలు బంకు నుంచి సీఎస్‌పురం వరకు రోడ్డు భారీ గుంతలు ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన దారులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి రోడ్డు గుంటలు పూడ్చి మరమ్మతులుచేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

అన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని గన్నవరం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ గత నెల 31వ తేదీ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా కనిగిరి గార్ల పేట రోడ్‌లోని హోటల్ నందుస్‌లో ఆదివారం ఆయనకు ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ స్కూల్ పూర్వపు విద్యార్థి కనిగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కెలం ఇంద్ర భూపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గతంలో విజ్ఞాన్ స్కూల్ తోటి ఆయన గురువు వెంకట రామిరెడ్డి తో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఇంద్ర భూపాల్ మాట్లాడుతూ విజ్ఞాన్ రెసిడెన్షియల్ స్కూల్‌ని ప్రారంభించి ఎంతోమంది విద్యార్థిని, విద్యార్థులకు చక్కని బోధన అందించారని వారంతా ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. మాకు గురువుగా కాక స్నేహితుడి లాగా ఉంటూ మాకు మార్గదర్శకంగా నిలిచాడని ఆయన అన్నారు. అనంతరం ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బంధుమిత్రులు పూర్వపు విద్యార్థులు వెంకట రామిరెడ్డి దంపతు లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, విద్యాశాఖ అధికారులు దాస్ ప్రసాద్, రామిరెడ్డి, సత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ సాన జైపాల్‌రెడ్డి ముక్కు పెద్దిరెడ్డి గవదకట్ల బ్రదర్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు బంధుమిత్రులు పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో గల తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా దేవరకొండ సామ్యూల్, ఉపాధ్యక్షులుగా విదుదల కిరణ్, కార్యదర్శిగా పులుకూరి జయరావు, కోశాధికారిగా రామస్వామి కార్యవర్గ సభ్యులుగా భూదాల సతీష్, దారి వేముల బాబి, గుర్రం ఆర్థర్, ఎలకపాటి పోలయ్య, దారి వేముల ప్రదీప్ మరియు యూత్ డైరెక్టర్‌గా సౌమ్య, స్త్రీల సమాజం అధ్యక్షులుగా మేరీ సలోమీ, సండే స్కూల్ సూపరిడెంట్‌గా వై గంగాభవాని, క్వయర్ డైరెక్టర్‌గా పి వరప్రసాద్ డైరెక్టర్‌గా సుస్మిత తదితరులను ఏకగ్రీవంగా చర్చి జనరల్ బాడీ కమిటీ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది. 2024 నుండి 2026 వరకు చర్చి కమిటీగా వ్యవహరిస్తారు.

రెండు వేర్వేరు కేసులు నమోదు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన కాసా నారాయణరెడ్డి, ఓబుల్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వి.నాగమల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. కాసా నారాయణరెడ్డి పై ఆస్తి వివాదంలో అల్లుడు ఓబుల్ రెడ్డి నెట్టడంతో కిందపడి గాయపడ్డాడు. దీంతో ఓబుల్ రెడ్డి పై కేసు నమోదు చేశారు. కాసా నారాయణరెడ్డి అకారణంగా మమ్మల్ని ఇబ్బందిపెట్టి పరువు బజార్ కీడుస్తున్నారని అల్లుడు ఓబుల్ రెడ్డి ఫిర్యాదు మేరకు నారాయణపేట కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకట శిబిరాలపై దాడులు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని బ్రాహ్మణపల్లి తాటిచెర్ల గ్రామాలలో ఆదివారం పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లుగా కొమరోలు ఎస్సై మధుసూదన్ రావు తెలిపారు. బ్రాహ్మణ పల్లె గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై దాడి చేసి 6 మంది వ్యక్తులను అరెస్టు చేసి రూ.5,890 నగదును స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు. తాటిచెర్ల గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరు మందిని అదుపులోకి తీసుకుని రూ.1,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు.

పంట కాల్వలోకి వ్యర్థాలు..పట్టించుకోని అధికారులు

బీఎస్పీ నాయకులు కాగిత కోటేశ్వరరావు

విశాలాంధ్ర - బాపట్ల : ఈస్ట్ బాపట్ల సందరాజుతోట పంచాయతీ పరిధిలోని హోలీ క్రాస్ స్కూల్ ఎదురు ఉన్న వసుధ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన వ్యర్థాలు, మురుగు నీరు పంట కాలువలోకి పైప్ లైన్ ద్వారా వదులుతుంటే అధికారులు పట్టించు కోవడం లేదని బహుజన సమాజ పార్టీ నాయకులు కాగిత కోటేశ్వరరావు అన్నారు. బీఎస్పీ నాయకులతో కలిసి కోటేశ్వరరావు ఆ ప్రాంతాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పంట కాలువలకు మురుగు నీరు వదలటం వలన సాగునీరు కలుషితమై,పంటలు పండకపోవడం,పంట నీరు పశువులు తాగడం వలన అనేక జబ్బులు వచ్చి పశువులు చనిపోయే అవకాశం ఉందన్నారు. పొలాల్లో వ్యవసాయం చేసుకునే రైతులు ఇదే నీరు తాగే అవకాశం ఉందని అధికా రులు ఈ విషయంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తురుమెళ్ళ అమ్మేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐని వార్డు స్థాయి నుంచి బలోపేతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

యువతకు వివరించి అటువైపు పయనించ కుండా నివారింపజేయాల్సిన అవసరం ఉందన్నారు. 2025 డిసెంబర్ 25 కి భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరములు అవుతున్న సందర్భముగా దేశ వ్యాప్తంగా ఉత్సవాలను పెద్ద ఎత్తున జరుపుకునేందుకు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగు కవాత్ కు శిక్షణ పొందిన వాలంటీర్లు అన్ని మండలాల నుండి హాజరు కావాల్సి ఉందన్నారు. ఇప్పటినుండే అందుకు తగిన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించుకోవాల్సి ఉందన్నారు. విద్యార్థి యువజన కార్మిక సంఘాలను నిర్మించుకొని తద్వారా కమ్యూనిస్టు పార్టీని ఆకర్షింప చేసేందుకు ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ ప్రతి ఒక్క సభ్యుడు పార్టీ కోసం రోజుకు ఒక గంట అయినా సమయాన్ని వెచ్చించాలన్నారు. పెడదారి పడుతున్న విద్యార్థి, యువజనలను ఆకర్షింప చేసే విధంగా పార్టీ కార్యక్రమాలను రూపొందించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పై ఉద్యమాలను చేసినప్పుడే పార్టీ బలోపేతం అవుతుందని అందుకు తగినట్లుగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, సిపిఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ పాల్గొన్నారు.

తూకాలు...కొలతల్లో మోసం

(మొదటిపేజీ తరువాయి)

విషయంలో ఏవిధమైన మోసానికి గురికాకుండా నాణ్యమైన వస్తువులను పొందటం వినియోగదారులుగా మన హక్కు కాని ఆ హక్కును సాధించుకోగలగటం అంత సులభమేమీ కాదు. విపణి వీధిలో వినియోగదారులుగా మనం ఎన్నో రకాలుగా మోసాలకు గురవుతూనేఉన్నాం. వస్తువులపై ముద్రించిన ధర కంటే ఎక్కువ ధరను వ్యాపారులు వసూలు చేస్తూనే ఉన్నారు. కిలో అని కండ్ల ముందే తూచి ఇచ్చిన కందిపప్పు వాస్తవానికి ఎనిమిది వందల గ్రాములే ఉంటోంది కొన్ని వస్తువులను ప్రామాణిక ముద్రతో విక్రయించాల్సిఉన్నా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలలో ఇప్పటికీ రాళ్లనే తూకాలకు వినియోగిస్తున్నారు. ఇక సాధారణ తూనిక రాళ్లపై ఎటువంటి ముద్రలూ ఉండవు. అక్కడ వ్యాపారులు చెప్పిందే వేదం ఎవరైనా వినియోగదారుడు ప్రశ్నిస్తే... అక్కడి వ్యాపారులంతా మూకుమ్మడిగా దాడులకు దిగుతున్న సంఘటనలూ అనేకం ఉంటున్నాయి.స్వీట్ల దుకాణాల్లోనూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ప్యాకింగ్‌లపై ఎక్కడా తయారీ తేదీ లేకుండానే విక్రయాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా తూనికలు కొలతల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ శాఖను సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఈ మోసాలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో సగటు వినియోగదారుడికి తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని వినియోగదారులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

తూనికలు కొలతల పై ప్రత్యేకంగా దృష్టి సారించాం గ్రామాలలో వినియోగదారులకు సదస్సులు ఏర్పాటు చేసి తూనికల కొలతల శాఖ పై అవగాహన కల్పిస్తున్నాం ఇప్పటికే జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం వ్యాపార సంస్థలు నిర్ణీత ప్రమాణాలు పాటించాలి లేకుంటే చర్యలు తప్పవు ఎక్కడైనా మోసాలు జరిగితే 9490420046 నెంబర్‌కు వెంటనే ఫిర్యాదు చేయాలని తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు నాయుడు తెలిపారు.

అమ్మ ఫౌండేషన్ పింఛను అందజేత

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామంలో సీమోను (108) అనే వృద్ధుడు సరైన వసతి లేక అనారోగ్యంతో జీవనం సాగిస్తున్నారు. అది గమనించిన అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోనేని వెంకటేశ్వర్లు వృద్ధునికి బ్రతికి ఉన్నంతవరకు శాశ్వత పింఛను అమ్మ ఫౌండేషన్ తరపున అందిస్తామని స్థానికుల ఆధ్వర్యంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆగస్టు నెల పింఛన్ అమ్మ ఫౌండేషన్ సభ్యుడు పాపిశెట్టి వీరేంద్ర వృద్ధుడు ఉండే ప్రదేశానికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా పాపిశెట్టి వీరేంద్ర మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండుసంవత్సరాల కాలం నుంచి వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు. అలానే వృద్ధుని పరిస్థితిని గమనించి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పింఛన్ అందజేయుటకు సహకరించిన అమ్మ ఫౌండేషన్ సేవా సంస్థ టీం సభ్యుడు మోడంపల్లి గ్రామానికి చెందిన అసిస్టెంట్ లైన్మెయిన్ గుంత కృష్ణ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బొర్రా ఈశ్వర్ కుమార్ మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గం లోని ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో నిస్సహాయ స్థితిలో ఎవరైనా ఉంటే అమ్మ ఫౌండేషన్ సేవాసంస్థ దృష్టికి తీసుకురావాలని అటువంటి వారికి అమ్మ ఫౌండేషన్ అండగా నిలుస్తుందని తెలిపారు.

పాఠశాలలో షార్ట్ సర్క్యూట్‌తో పుస్తకాలు దహనం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం షార్ట్ సర్క్యూట్ వల్ల గదిలోని పుస్తకాలు, ఎగ్జామ్స్ పేపర్స్ నాలుగు ప్రొజెక్టర్లు, నాలుగు కంప్యూటర్స్ తగలబడిపోయాయి. స్థానికులు సమాచారం ఇవ్వటంతో అగ్నిమాప సిబ్బంది మంటలను ఆర్పారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి పి. ఆంజనేయులు స్పందించి సిఆర్పి లతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని దగ్గరుండి సిబ్బందితో మంటలు పూర్తిగా ఆర్పించి పై అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు పి.బాలు నాయక్ స్పందించి మంటలను ఆర్పటంలో పుస్తకాలను భద్రపరచడంలో తన వంతు సహకారం అందించారు. మంటలను ఆర్పే సమయంలో సమయంలో బాల్ నాయక్ చేతికి కొద్దిగా మంట అంటుకొని చేతికి చిన్న బొబ్బలు రావడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎంఈఓ బాలునాయక్ ని ట్రీట్మెంట్ చేయించుకో అని వేరే వ్యక్తి ద్వారా ఆస్పటల్ పంపించడం జరిగింది.

పేకాట శిబిరంపై దాడి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామంలోని దేవాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు జూ దరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న 11 వేల 30 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ముండ్లమూరు ఎస్సై వి నాగమల్లేశ్వరరావు వివరాలు వెల్లడించారు. కేసు నమోదు చేసామని, నిందితులను న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది ప్రేమ నిధి, కాశి రాజు, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండలంలోని పాత ముడివేముల ఊరి శివారులో పేకాట స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులు యస్ఐ సాంబశివయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ దాడులలో 5 మంది పేకాట రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుండి సుమారుగా 19510 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే తమకు సమాచారం అందించాలని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది వున్నారు.

ఐనముక్కల గ్రామంలో బోనాలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని ఐనముక్కల గ్రామంలో పోలేరమ్మ, అంకాలమ్మ, దేవాలయంలో రెండో వార్షికోత్సవం, అంకాలమ్మ దేవత, పోలేరవఆయన ముక్కుల గ్రామంలో వైభవంగా బోనాలు విశాలాంధ్ర పెద్ద దోర్నాల. మండలంలోని ఆయన ముక్కల గ్రామంలో పోలేరమ్మ, అంకాలమ్మ, దేవాలయంలో రెండో వార్షికోత్సవం, అంకాలమ్మ దేవత, పోలేరమ్మ బోనాలను ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని . వారికి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల నుంచి భక్తులు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మహిళలు పొంగళ్ళు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పోలేరమ్మ,అంకాలమ్మ బండ్ల ను గట్టి ఊరేగింపుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఓ బోనాలను ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని వారికి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల నుంచి భక్తులు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

మహిళలు పొంగళ్ళు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పోలేరమ్మ,అంకాలమ్మ బండ్లను గట్టి ఊరేగింపుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదల సమస్యలను విస్మరిస్తున్న పాలక వర్గాలు

ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్ విమర్శ

విశాలాంధ్ర-మార్కాపురం : ఎంపీజే కార్యకర్తల సమావేశం పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో పట్టణ కమిటీ అధ్యక్షులు షేక్ అమీర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యంపీజే రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ యుండి ఖదీర్, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు షేక్ రసూల్, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ ఖాశిం, పట్టణ ప్రధాన కార్యదర్శి పి. అయుబ్ ఖాన్‌లు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కె అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు శక్తిని తమ వద్ద కేంద్రీకృతం చేసుకుని తమకు ఇష్టమైన రీతిలో పరిపాలిస్తున్నాయని విమర్శించారు. యంపీజే ప్రజల ఇష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పోరాటం చేస్తుందని అన్నారు. అవసరమైతే సమస్యలను పరిష్కరించడానికి ప్రెజర్స్ గ్రూపుగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే దేశంలో, రాష్ట్రంలో శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తుందని, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రత్యేక స్టడీ సర్కిల్ నిర్వహిస్తుందని, పీడితులకు అండగా ఉంటూ, అవినీతికి వ్యతిరేకంగా, అన్యాయం జరిగిన వారికి న్యాయం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణ కమిటీని సభ ఏకగ్రీవంగా ఎన్నుకోంది .మార్కాపురం పట్టణ అధ్యక్షుడుగా షేక్ నాగూర్ మీరావలి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ మస్తాన్ వలి, షేక్ అబ్బాస్, ప్రధాన కార్యదర్శిగా పఠాన్ హబీబుల్లా ఖాన్, కోశాధికారిగా షేక్ జవాద్ అహ్మద్, ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. తదనంతరం ఇస్లాం పేట మస్జిద్ ఎదురుగా ఉన్న నూతన యంపీజే ఆఫీస్ ను సామాజిక వేత్త, రిటైర్ పోస్టల్ ఉద్యోగి షేక్ నజీర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ యంపీజే కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : తల్లి పాల ప్రత్యేకత, ప్రయోజనాలు గురించి ప్రజలకు తెలియజేయడానికి ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు జరుపుకొంటున్నట్లు అంగన్వాడీ సూపర్ వైజర్ శివ లక్ష్మీ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఐటి వరం పంచాయితీ సచివాలయం పరిధిలో గల అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ శివ లక్ష్మీ మాట్లాడుతూ నవజాత శిశువులకు తల్లి పాలే అమృతంతో సమానం అన్నారు. ఆ పాలలో బిడ్డకు సరిపడే పోషకాలు, వ్యాధి నిరోధక ఉంటాయని తెలిపారు. పిల్లలు శరీరక, సర్వతోముఖ అభివృద్ధికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. శిశువు పుట్టిన అరగంట నుంచి గంటలోపు మొదటిసారి తల్లిపాలు ఇవ్వాల న్నారు. మొదటి మూడు రోజులు బిడ్డకు కొలొస్ట్రమ్ ఇవ్వాలని చెప్పారు. మొదట వచ్చే పసుపు కొలొస్ట్రమ్ శిశువుకు తొలి టీకాగా పని చేస్తుందన్నారు. కొలొస్ట్రమ్ లో పోషకాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. భవిష్యత్తులో దీర్ఘకాలిక వ్యాధులను నివారిస్తుందన పేర్కొన్నారు. శిశువు పొట్టను శుభ్రంగా ఉంచుతుం దన్నారు. ఆరు నెలలు వయస్సు వరకు తల్లి పాలు మాత్రమే తాగించాలి చెప్పారు. ఆరు నెలలు వయస్సు తర్వాత తల్లి పాలతో పాటు కాంప్లిమెంటరీ వీనింగ్ సాఫ్ట్ ఫుడ్ ను ప్రారంభించాలని వివరించారు. బిడ్డకు రెండు సంవత్సరాల వయస్సు తర్వాత కూడా తల్లి పాలను తాగించాలన్నారు. ఇది పిల్లల మేధస్సు స్థాయిని పెంచుతుందని చెప్పారు. సరిగ్గా తల్లి పాలు పడితే త్వరగా గర్భం దాల్చదని తెలిపారు. ఇది సహజ కుటుంబ నియంత్రణ లాంటిదని వివరించారు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయం క్యాన్సర్లు రావన్నారు. అనంతరం ఐటి వరం పంచాయితీలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ ధాత్రి, పంచాయతీ సెక్రటరీ పాండురంగారావు అంగన్వాడి కార్యకర్తలు చైతన్య, మల్లేశ్వరి, లలిత కుమారి, నాగలక్ష్మి, కృష్ణకుమారి, లాలీ బాయ్ సచివాలయ సిబ్బందీ ఈశ్వర్ నాయక్, గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది



విశాలాంధ్ర-పుల్లలచెరువు : క్షేత్ర స్థాయిలో ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. దీంతో ప్రజలకు అందజేయాల్సిన సేవలలో జాప్యం చోటుచేసుకుంటోంది. ప్రజలు సిబ్బంది రాక కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పుల్లలచెరువు మండలంలోని మానేపల్లి తోపాటు మరో మూడు గ్రామాలకు సేవలు అందించే సచివాలయం మానేపల్లి గ్రామంలో ఉంది. పలువురు ప్రజలు కార్యాలయాలకు వచ్చి సిబ్బంది లేకపోవడంతో చేసేది ఏమి లేక తీవ్ర అసహనం వ్యక్తం చేసి వెనుతిరిగి వెళ్లిపోయారు. పనుల కోసం 25 కి.మీ దూరం వ్యయ ప్రయాసలు పడి మండల కేంద్రాలకు వస్తే సిబ్బంది లేరంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ వెళ్లారు. ఇప్పటికైనా ఇప్పటికైనా ఉన్నతా ధికారులు మారుమూల గ్రామాల్లో ప్రజలకు అందు తున్న సేవలపై ఆరా తీయాలని, సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బిడ్డకు ముర్రుపాలు..తల్లికి మురిపాలు

- తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం
- ఆగస్టు ఏడు వరకు ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర- పీసీపల్లి : తల్లికి మించిన దైవం లేదు. అమ్మ పాలకు మించిన అమృతం లేదు. నవమాసాలు గర్భంలో ఉండి అమ్మ నుండి అందుకొన్న తొలి వరం కమ్మనైన క్షీరం. మన దేశంలో ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయి.బిడ్డ ఆరోగ్యం తల్లి పాల నుంచే బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లి పాలు త్రాగించటం ప్రారంభించాలి. మొదట ఆరు నెలల వయస్సు వరకు తల్లి పాలు మాత్రమే ఇప్పించడం ఆరు నెలల మీదట అనువైన కుటుంబ ఆహారం అదనంగా ప్రారంభించడం తల్లిపాలు రెండు సంవత్సరాల వయస్సు వరకు లేదా వీలైనంత కాలం ఇప్పించడం చేయాలి. ఆరోగ్యంగా ఉంటే అడివిలోనైనా ఆనందంగా బతికేయవచ్చు. తల్లి పాలు తాగడం నుండే బిడ్డ ఆరోగ్యం ఆరంభం అవుతుంది. ఇవి శిశువుకు ప్రకృతి ఇచ్చే సహజ సిద్ధమైన టీకా ఇవి సహజమైన పునరుత్పాదకమే కాకుండా వ్యర్థాలు కాలుష్యం లేని వనరు బిడ్డకు ఈ పాలు ఎంతో శ్రేష్ఠమే కాక పౌష్టికాహారం కూడా శిశువుకు తల్లి పాలకు మించిన ఆహారం లేదు ఉండదు ఉండబోదు కూడా ఇవి ప్రోటీన్లు విటమిన్లు పిండి పదార్థాలు కాల్షియం, పొటాషియం, ఖనిజాలు, సూక్ష్మపోషకాలు, అవసరమైన మేరకు పుష్కలంగా ఉండడం వలన పిల్లలు తగినంత బరువు పెరుగుతారు. వీటిలో శక్తివంతమైన ప్రతిరోధకాలు ఉన్న కారణంగా అంటువ్యాధులు వైరల్ ఇన్ఫెక్షన్లు అలర్జీలు ఆస్తమా చెవి సంబంధిత వ్యాధులు సెప్సిస్ న్యుమోనియా డయేరియాల నుండి శిశువును కాపాడుతాయి. వీటిలో ఫ్యాటీ ఆసిడ్స్ బిడ్డ మెదడు పెరుగుదలకు దోహదం చేయడం వలన తెలివితేటలు పెరుగుతాయి. ప్రసవం అయిన వెంటనే మొదటి అరగంట నుండి ఒక గంట వ్యవధిలో తల్లి పాలలో కొలొస్ట్రం ఉంటుంది. ఈ పాలు ఎంత తొందరగా తాగించడం మొదలుపెడితే అంత మంచిది. బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచడంతో పాటు ఇంతకు ముందు చెప్పుకున్న లాభాలన్నీ పొందవచ్చు. శిశువు జీవితంలోని మొదటి నెలలకు అవసరమైన శక్తిని, పోషకాలను తల్లి పాలు అందిస్తాయి. బిడ్డకు ఆరు నెలలు పూర్తయ్యేవరకూ తల్లి పాలు మాత్రమే పట్టాలి. ఈ ఆరు నెలలు చాలా కీలకం. తల్లి పాలల్లో ఎనభై శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది. తల్లి తన బిడ్డకు దాహం వేస్తున్నట్లు అనిపించినప్పుడల్లా పాలివ్వవచ్చు. వేడి వాతావరణంలో కూడా ఆరు నెలల వయస్సులోపు పిల్లలకు నీరు అవసరం లేదు. ఆరు నెలల తరువాత తల్లి పాలతో పాటు పరిపూర్ణమైన ఆహారాన్ని అందించడం మొదలు పెట్టవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. అదనపు ఆహారంతో పాటు కనీసం రెండేళ్లు తల్లి పాలు పట్టాలి. తల్లికి పాలు తాగే బిడ్డకు ఎలాంటి సమస్య రానంత వరకూ తల్లి మరల గర్భంతో ఉన్నా కూడా బిడ్డకు పాలు ఇవ్వవచ్చు. ఆ తరువాత తల్లీ బిడ్డలకు ఇష్టమైనంతవరకూ తల్లి పాలు పెట్టవచ్చు.

అన్ని అపోహలకు దూరంగా :

తల్లిపాల గురించి సమాజంలో కొన్ని అపోహలు ఉన్నాయి. వీటివలన కొంత మంది శిశువులు తల్లి పాలకు దూరం అవుతున్నారు. అటువంటి తల్లులకు ఈ సందర్భంగా అవగాహన చెయ్యవలసిన అవసరం ఉంది. కొంత మంది పిల్లలు పాలు త్రాగిన వెంటనే వాంతి చేస్తారు. తాగేటప్పుడు నోటితో కొంత గాలిని పీల్చడం వలన ఇలా జరుగుతుంది. ఇది ప్రమాదం కాదు. దీనిని వైద్య భాషలో పోసెట్టింగ్ అంటారు. తల్లిపాలు పెట్టిన వెంటనే నేల లేదా మంచంపై పడుకోబెట్టకుండా, భుజంపై వేసుకొని కొంతసేపు ఉంచాలి. ఎక్కువగా కదల్చరాదు. ఎక్కువ వేడి ఉన్నప్పుడు బిడ్డకు అదనంగా నీరు అవసరం లేదు. బిడ్డకు అవసరమైన నీరు తల్లిపాలలో ఉంటాయి. శిశువుకు విరేచనాలు అయితే కొంతమంది తల్లులు పాలుపట్టరు. డాక్టరు సలహా మేరకు పట్టించడం ఆపాలే తప్ప సొంతగా అపనవసరం లేదు. తల్లి గర్భవతిగా ఉన్నా కూడా బిడ్డకు పాలివ్వవచ్చు కొన్ని పరిస్థితులలో ఒకటి రెండు రోజులు బిడ్డకి అందించక పోయినా తరువాత వెంటనే తల్లిపాలు ఇవ్వాలి. పాలిచ్చే తల్లి అవసరం మేరకు పండ్లు తీసుకోవాలే తప్ప ఎక్కువ పండ్లు తల్లి తీసుకోనవసరం లేదు మరో పెద్ద అపోహ ఏంటంటే సిజేరియన్ అయిన వెంటనే తల్లి లేవకూడదని పాలు తాగించరు అలాకాక తల్లి పాలు ఇవ్వగలిగే స్థితిలో ఉంటే డాక్టర్ సూచన మేరకు నర్సుల సహాయంతో బిడ్డకు పాలు ఇవ్వాలి. శిశువు పుట్టిన తరువాత తల్లి నుండి వచ్చే పాలు సరిపోవని బయట పాలు అందిస్తారు, అలా చేయకుండా తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి.

అంతకు మించిన అందం ఉందా? :

మన దేశంలో కొంత మంది తల్లులు బిడ్డకు పాలు పెట్టడం వలన తమ అందం పోతుందని పాలివ్వరు. అమ్మతనానికి మించిన అందం ఈ ప్రపంచంలో ఉందా? ప్రకృతిలో ఏ జంతువు ఇలా ఆలోచించదు. బిడ్డకు బయట నుండి డబ్బాపాలు అందిస్తారు. ఇది చాలా తప్పు. ప్రకృతి ప్రసాదించిన గాలినే పీల్చుతాం. ప్రకృతి అందించిన నీటినే త్రాగుతాం. వీటికి ప్రత్యామ్నాయంగా ఇంకేమైనా తీసుకోగలమా అలానే తల్లి పాలకు కూడా ఇంకో ప్రత్యామ్నాయం లేదు. విదేశాల నుండి తీసుకొచ్చిన పాల పొడులు కూడా అమ్మ పాలకు మించిపోవు. తల్లులందరూ బాగా ఆలోచించాలి. పిల్లలకు పెద్దయిన తరువాత ఆస్తులు, అంతస్తులు, డబ్బు ఇవ్వాలనుకుంటారు. కానీ వాటి కంటే పిల్లలకు ఇచ్చే మొదటి ఆస్తి తల్లిపాలనే విషయం గుర్తెరగాలి. పాలివ్వడం వలన అందంమేం తరగదు. ఇంకా పెరుగుతుంది.

బిడ్డకు పాలిస్తే తల్లికి లాభమే :

బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి కూడా లాభాలున్నాయి. ప్రసవంలో తల్లి బరువు ఎక్కువ పెరుగుతుంది. పాలివ్వడం వలన బరువు తగ్గుతారు. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ రక్తపోటు, టైప్ 2 మధుమేహం వంటి రోగాలు భవిష్యత్తులో రాకుండా అడ్డు కుంటాయి. పిల్లలు పుట్టిన తర్వాత తమ శిశువులకు పాలిచ్చే తల్లులు ఎక్కువగా ఉండే దేశం క్రొయేషియా ఇక్కడ 98 శాతం మంది తల్లులు తమ బిడ్డలకు పాలిస్తున్నారు. ఇంకా రువాండా చిలీ బురుండి వంటి దేశాలలో ఉండే తమ పిల్లలకు పాలిచ్చే తల్లులు 80 శాతం కంటే ఎక్కువ మంది ఉన్నారు. కానీ కొన్ని పరిస్థితులలో అనగా ఉద్యోగరీత్యా, బయట పనులు చేయడం వలన తమ శిశువుకు పాలు అందివ్వలేరు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారికి ప్రసవానంతర సెలవులు ఇస్తున్నారు. అలానే ప్రైవేటు రంగంలో కూడా కనీసం ఆరు మాసాలు వేతనంతో కూడిన సెలవివ్వాలి. పాలిచ్చే అమ్మ పొలం పనులకు కూలీ పనులకు, ఆ ఆరు మాసాలు వెళ్లకుండా ఇంటిలోని యజమానులు, కుటుంబ సభ్యులు సహకరించాలి. ఈ సంవత్సర లక్ష్యాలు ఆరోగ్య కేంద్రాలు పని ప్రదేశాలలోని మహిళా ఉద్యోగినులకు మద్దతుకై దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన చర్యలు, ప్రసూతి అర్హతలు మరియు ఇతర సహాయ చర్యల సమాచారాన్ని తెలియపరచడం, ఈ దిశగా ప్రస్తుతం ఉన్నటువంటి ఉద్యోగినులను ప్రోత్సహించే కార్యక్రమాలను బలోపేతం చేయడం.

ఒకటి నుంచి ఏడు వరకు
తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం :

ప్రతి ఏటా ఆగస్టు ఒకటి నుండి ఏడో తారీఖు వరకు తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని అందులో భాగంగా అన్ని అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వారం రోజులు జరిగే ఈ తల్లిపాల వారోత్సవాన్ని శ్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఐసిడిఎస్ అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ జరీనా తెలిపారు.

డంప్ చేసిన ఇసుక తనిఖీ

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణంలోని ఎర్రపల్లె గ్రామానికి రహదారిలో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను ఎవస్ఈబి సీఐ కొండారెడ్డి వారి సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. కానీ అక్రమంగా నిల్వ ఉంచిన డంప్‌పై ఎలాంటి కేసు నమోదు చేయలేదని వారు తెలిపారు. అక్రమంగా ఇసుకను డంప్ చేసిన వారి యొక్క వివరాలను సేకరించి విలేకరులు అక్కడికి వెళ్లేసరికి.. అక్కడినుండి వారు జారుకున్నారు.. కేసు నమోదు చేశారా అని అడుగుతే నమోదు చేయలేదని తెలిపారు.

నిలిచిన సాగర్ నీటి సరఫరా

తాగునీటికి ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమెట్ల ఎస్సీ కాలనీలకు సాగర్ నీటి సరఫరా నిలిచిపోయి 20 రోజులు పైగా వస్తుంది. దీంతో తాగునీటికి గ్రామస్తులు కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లోరిన్ నీటిని తాగడం వల్ల నడుములు, మోకాళ్ళు, ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్నామని గ్రామస్తులు ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు పెట్టి కొనుగోలు చేసి మినరల్ వాటర్‌ను తాగాల్సిన పరిస్థితి తప్పడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటి సరఫరా చేసే మోటార్ మరమ్మతుల గురికావడంతో, నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంపై అధికారులకు పలు మార్లు విన్నవించిన పట్టించుకునే అధికారులే లేరని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని, మోటారుకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-టంగుటూరు : శాఖ గ్రంథాలయం టంగుటూరు ఆధ్వర్యంలో విద్యార్థులకు చదవడం నాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని నూతన పుస్తకాలను చదివి వాటిలో ఉన్న కొత్త విషయాలను తెలుసుకుని వివరించారు. శాఖ గ్రంథాలయం నిర్వాహకులు, గుమ్మడి వర్ధన రాజ్ మాట్లాడుతూ పుస్తక పఠనం వలన విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెరుగుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా గ్రంథాలయాలకు పంపిస్తూ పుస్తక పఠనం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు గ్రంథాలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై చర్చ

విశాలాంధ్ర- నాగులుప్పలపాడు : గ్రామాల్లో నెలకొన్న పలుసమస్యలపై సభ్యులు ఆదివారం మండల సర్వసభ్య సమా వేశంలో చర్చించారు. ఆదివారం నాగులుప్పలపాడు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సభ్యులు విద్యుత్ సమస్యపై ప్రశ్నించారు. ఉప్పుగుండూరు గ్రామంలో లో-వోల్టేజీ సమస్యను ఆ గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మున్నంగి వెంకట్రావు లేవనెత్తారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ స్పందిస్తూ విద్యుత్ లైన్లు క్లీయర్గా ఉండాలని, కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు కూడా సహకరించాలని ఏఇ రమేష్ బాబు కోరారు. అలాగే ఒమ్మెవరం గ్రామ సర్పంచ్ పాలపర్తి బాలకోటి మాట్లాడుతూ ఉప్పుగుండూరు నుండి భీమవరం వరకు విద్యుత్తులైన వెయ్యడానికి ఎస్టిమేషన్ వేయాలని కోరారు ఎస్టిమేషన్ అమౌంట్ శాసనసభ్యులతో మాట్లాడి నిధులు కేటాయించుకుని పరిష్కరించుకుంటామని అన్నారు మద్దిరాలపాడులో తీగల తెగిపడి ప్రమాద మరితంగా ఉన్నాయని స్వర్ణ అనురాధ ప్రశ్నించారు అలాగే కొత్తకోట సచివాలయంలో లైన్‌మెన్ కొరతతో విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవడం ఇబ్బందిగా ఉందని తక్కెళ్లపాడు సర్పంచ్ రామ్మోహన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొంత మంది సభ్యులు ఇసుక తవ్వకాలు, మట్టితవ్వకాలను అక్రమంగా తోలు తున్నారని అన్నారు. దీనిపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ జయలక్ష్మి స్పందిస్తూ, అక్రమ తవ్వకాలను నిలిపివేసే హక్కులు సర్పంచ్కు ఉంటుందని సూచించారు. దీనిపై పలువురు సర్పంచులు మాట్లాడుతూ.. సర్పంచులకు గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లను అడ్డం పెట్టుకొని తమ హక్కులను కాలరాశారని, గౌరవాన్ని కూడా భంగపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తప్రభుత్వమైన సర్పంచులకు సముచిత గౌరవం ఇవ్వాలని కోరారు. ఏపీఎం రవికుమార్ మాట్లాడుతూ గోకులం రైతు వారి కుంటలు మంజూరయ్యాయని తెలిపారు. అదేవిధంగా గత సంవత్సరం సంబంధించిన ఉపాధి పనులకు కూలీలకు 50 నుంచి 60 లక్షల వరకు రావాల్సి ఉందని అన్నారు. ఆర్ అండ్‌బి ఏఈ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నిడమానూరు వద్ద చప్టాకు అమ్మనబ్రోలు నుండి కనపర్తి వరకు రోడ్డుకు మరమ్మత్తుల కొరకు నిధులు మంజూరైనాయి అని అన్నారు. ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష మాట్లాడుతూ ద్వారా పండ్లతోటల సాగుకు ప్రోత్సాహం అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో మహాలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు రత్నభారతి పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు అన్నా క్యాంటీన్ ప్రారంభం

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేద కుటుంబాలకు ఐదు రూపాయలకే భోజనంతో పాటు అల్పాహారం అందించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్‌ను రేపల్లె పట్టణంలో అంబేద్కర్ పార్క్‌లో సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ ఏఈ రోహిణి తెలిపారు. ఈ సందర్భంగా పనులను దగ్గరుండి ఏఈ పర్య వేక్షిస్తున్నారు. విశాలాంధ్రతో మాట్లాడుతూ ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని,బయట ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. చుట్టూ గ్లాస్ ఫిట్టింగ్,గోడల మరమ్మతులు,ఆహారం అందించే విధంగా టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.ఆగస్టు 15న అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నా రు. ఇందుకు సంబంధించి అన్న క్యాంటీన్‌కు పూర్వ వైభవం వచ్చే విధంగా అందంగా టిడిపి రంగులతో క్యాంటీన్‌ను ముస్తాబు చేస్తున్నారు.ఆగస్టు 15న ఈ క్యాంటీన్ ప్రారంభమైతే రేపల్లె పట్టణ,పరిసర ప్రాంత పేద,మధ్యతరగతి ప్రజలకు ఐదు రూపాయలకే భోజనం అందుబాటులోకి రానున్నది.దీంతో పేద,మధ్యతరగతి ప్రజలు,భోజన ప్రియులు,హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రావణమాస రక్షాబంధనం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రేపల్లె : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రావణ మాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ ఆదివారం తెలిపారు. కనగాల శివాలయంలో మండల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ ఈ నెల19 తేదీ శ్రావణ పౌర్ణమి సందర్భంగా రక్షా బంధనం కార్యక్రమం నిర్వహించా లని,అనుబంధాల రక్షణ కోసం హిందూ ధర్మ రక్షణ కోసం,ధర్మ రక్షాబంధన్ కార్యక్రమం19వ తేదీ నుండి 22వ వరకు గ్రామాలలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ధార్మిక సమితులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఆగస్టు 5వ తేదీ తులసీదాస్ జయంతి హనుమాన్ చాలీసా పారాయణం,10వ తేదీ రెండవ శనివారం సత్సంగములు బాలవికాస్ శిక్షణా తరగతి నిర్వహించాలని,ఈనెల 15,29వ తేదీలలో ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించాలని, తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు,ఫౌండేషన్ సభ్యులు దుంపా ప్రసాదరావు,అద్దంకి నాగేశ్వరరావు,అర్చకులు జనతా రావు,ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : టీఆర్సీ ప్రభుత్వ ఐటిఐ గూడవల్లిలో 2024-25 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల కొరకు మూడోదఫా ప్రవేశానికి రెండు సంవత్సరాల కోర్సులు మోటార్ మెకానిక్ డాక్యుమెంట్ సివిల్,ఒక సంవత్సర కోర్సు మెకానిక్ డీజిల్ సీట్లకు దరఖాస్తులను ఐటిఐ.ఏపీ.జి.ఓ.వి.ఐ.ఎన్ ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్యాంప్రసాద్ తెలిపారు.దరఖాస్తులు ఈ నెల రెండో తేదీ నుండి 26 సాయంత్రం ఐదు గంటల లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అడ్మిషన్లు పదవ తరగతి పాస్ మార్కులు ఆధారంగా మెరిట్ రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు.ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పదో తరగతి మార్కులు జాబితా కుల ధ్రువీకరణ పత్రం టీసీ ఆధార్ కార్డ్ ఫోటో మెయిల్ ఐడి పర్మినెంట్ సెల్ నెంబర్తో గూడవల్లి కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరిశీలన చేయించు కోవాలన్నారు.వివరాల కోసం 7702400570, 9398650408, 9491185900 నెంబర్లలో సంప్రదించాలన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆర్.శ్యాంప్రసాద్ తెలిపారు.

ప్రథమ చికిత్స శిక్షణ అత్యవసరం

రాష్ట్ర రీసోర్స్ పర్సన్ రత్న శేఖర్

విశాలాంధ్ర - రేపల్లె : స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం రేపల్లెలోని సంజీవని మల్టీ స్పెషాలిటీ ఎమర్జెన్సీ కేర్ హాస్పిటల్‌లో ప్రథమ చికిత్స గురించి అవగాహన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రథమ చికిత్సకు సంబంధించి తిరుపతికి చెందిన రాష్ట్ర రిసోర్స్ పర్సన్ రత్న శేఖర్‌తో శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని పరిస్థితు లలోనూ ప్రథమ చికిత్స అందించే విధానం గురించి రిసోర్స్ పర్సన్ తెలియజేశారు. ప్రధానంగా సిపిఆర్ ఏ విధంగా నిర్వహించాలో డిమాని స్ట్రేషన్ చేసి చూపించడమే కాకుండా,అందరి చేత డిమానిస్ట్రేషన్ చేయించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా వైస్ చైర్మన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ వసంతం వీర రాఘవయ్య మాట్లాడు తూ ప్రతి ఆరోగ్య కార్యకర్త విధిగా ప్రథమ చికిత్స శిక్షణను పొందాలని తెలిపారు. అతిముఖ్యంగా సిపిఆర్‌లో నిష్ణాతులు కావాలని అలాంటప్పుడే సాటి మనిషి ప్రాణాలు పోకుండా అత్యవసర సమయాలలో ప్రథమ చికిత్సను అందించవచ్చని,ఆ విధం గా హాస్పటల్‌కు చేరేవరకు అతని ప్రాణాలను కాపాడవచ్చు అని అది ఒక సిపిఆర్ చేయడం వలననే సాధ్యపడుతుందని తెలిపారు. అలాగే అన్ని విపత్కర పరిస్థితుల్లోనూ ప్రమా ద పరిస్థితుల్లోనూ ప్రథమ చికిత్స ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అందరూ శ్రద్ధతో ఈ ప్రథమ చికిత్స ను నేర్చుకుని తమ నైపుణ్యతలను పెంచుకోవాలని డాక్టర్ వసంతం వీరరాఘవయ్య సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభ కార్యక్ర మంలో రేపల్లె, పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ టెక్నీషియన్ కె.సాంబశివ రావు,రెడ్ క్రాస్ సిబ్బంది అడుసు మల్లి ప్రభాకరరావు,సయ్యద్ కరీము ల్లా,బ్లడ్ బ్యాంక్ కార్యకర్తలు,సంజీవని ఎమర్జెన్సీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలతో చెలగాటమాడుతున్న ఆటోవాలాలు

- ◆ కాసుల కోసం కక్కుర్తిపడి అధిక జనంతో తీసుకెళుతున్న ఆటోవాలా
- ◆ ప్రమాదాలు జరగకముందే పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె తీర ప్రాంత గ్రామాల నుండి హైవేపై వేగంగా ఆటో నడుపుతూ వ్యవసాయ కూలీలను ప్రతిరోజు ఉదయం సమయంలో ఆటో డ్రైవర్లు తీసుకెళ్తున్నారు. వ్యవ సాయ పనులు ప్రారంభమైన తరుణంలో పొట్టకూటి కోసం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్లి వ్యవసాయ కూలీ పనులు చేసుకుని వస్తున్న వ్యవ సాయ కూలీలతో డ్రైవర్లు తమ ప్రాణాలతో చెలగా టమాడుతూ రెండు ఆటోలలో ఎక్కించవలసిన కూలీలను ఒక ఆటోలో ఎక్కించి అధిక లోడుతో వ్యవసాయ కూలీలను తీసుకు వెళ్తున్నారు. గతంలో ఎంతోమంది అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేసిన మారని ఆటో డ్రైవర్ల తీరు. ఆటో డ్రైవర్లు వాళ్ల జేబులు నింపుకోవడానికి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సంబంధిత ఆర్టీవో అధికారులు,పోలీస్ అధికారులు స్పందించి వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించి ఆటో డ్రైవర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రవాణా శాఖ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

విశాలాంధ్ర - అద్దంకి : స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని ఎస్.ఎస్.సి 1989-90 పూర్వ విద్యార్థుల సేవాస్ఫూర్తి కమిటీ మిత్రులు ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. సింగరకొండ రోడ్డు లోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేసి బధిర వికలాంగ పిల్లల మధ్య వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలకు కూలింగ్ వాటర్ ఫ్రిడ్జ్ వాటర్ బబుల్ అందజేసి 65 మంది పిల్లలకు మధ్యాహ్నం సా యంత్రం రెండు పూటలా భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్ మాట్లాడుతూ 2015 లో ఏర్పడిన సేవాస్ఫూర్తి కమిటీ గత తొమ్మిది సంవ త్సరాల నుండి ప్రతి సంవత్సరం వృద్ధాశ్రమాలు అనాధ ఆశ్రమాలు బధిరుల పాఠశాలలలో స్నేహితుల దినోత్స జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఇప్పటివరకు రూ.36 లక్షల వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించామని భవిష్యత్తులో కూడా ఇలానే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధర్మవరపు వెంకటరావు,కొత్త శ్రీమన్నారా యణ,బాలాజీ,పురుషోత్తం,ఘంటసాల శ్రీను, చెన్నుపల్లి నాగేశ్వరరావు,బెల్లం రాజేష్, పాఠశాల చైర్మన్ పూనూరు ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మండలం వేజెళ్లవారిలంక గ్రామంలో ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై హరిబాబు,తన బృందంతో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న పదివేల రెండు వందల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. ఎవరైనా పేకాట,నెంబర్లు ఆట,కోడిపందాలు,చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిబాబు హెచ్చరించారు.

హరీష్‌పేట సర్పంచ్ భార్య వియోగం

విశాలాంధ్ర - రేపల్లె : నియోజకవర్గంలోని హరీస్‌పేట గ్రామ సర్పంచ్ చిప్పల వెంకటేశ్వ రరావు,భార్య చిప్పల వెంకటేశ్వరమ్మ (60) ఆదివారం హరీస్‌పేట గ్రామం తమ స్వగృ హంలో అనారోగ్య కారణంగా మృతిచెందా రు. వారి భౌతికకాయాన్ని మాజీ మంత్రి, రాజ్య సభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు సోదరుడు నిజాంపట్నం మండల ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల వెంకట హరనాథ్ బాబు,నిజాంపట్నం ఎంపీటీసీ నాజర్ ఖాన్, వైసీపీ నాయకులు,గురునాధనగర్ సర్పంచ్ అశోక్,బూత్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వరావు, చిరంజీవి మాష్టారు,సైకం సూర్య చంద్రరావు, కొక్కిలిగడ్డ రాజేష్,ధనుంజయ రావు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఘనంగా పోలేరమ్మ వార్షికోత్సవం

విశాలాంధ్ర - బల్లికురవ : మండల కేంద్రమైన బల్లికురవ గ్రామంలో భక్తుల పాలిట కొంగుబంగారమై విరజిల్లుతున్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి 13వ వార్షిక మహోత్సవ ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం అంగ రంగ వైభవంగా ఘనంగా నిర్వహించా రు. వేకువజాము నుండి వేద పండితులు అమ్మ వారికి అభిషేకాలు హోమాలు నిర్వహించగా, వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నా రు. వార్షికోత్సవ పురస్కరించుకుని దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో రంగురంగు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు,గ్రామస్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వేళ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జీవో 77ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల : గత ఐదు సంవత్సరాలు రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా దీనస్థితికి పడిపోయిందని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సూళ్ళూరు యచంద్ర తెలిపారు. బాపట్ల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో నెంబర్ 77 ప్రైవేట్ పెట్టి రాష్ట్రంలో విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేశారని దీని కారణంగా నీట్ విద్యార్థులు పీజీని అభ్యసించ లేకపోయారని తెలిపారు. ఇప్పటి విద్యాశాఖ మంత్రి పాదయాత్రలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జీవో నెంబర్ 77ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని కోరారు. వైద్య విద్యలో జీవో నెంబర్ 107,108 కారణంగా పేద విద్యార్థులు వైద్య విద్యకి దూరమయ్యే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయని ఆ రెండు జీవోలను కూడా ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో యూనివర్సిటీలోని అధ్యాపక పోస్టులకు సంబంధించి విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించి ఒక క్లారిటీ ఇచ్చి తక్షణమే విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్నటువంటి అధ్యాపక,ఇతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,రాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల రెగ్యులర్ ఉపకులపతులను, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ని వీలైనంత త్వరలో నియమించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు అధ్వాన స్థితిలో ఉన్నాయని సొంతభవనాలు కూడా లేక అద్దె భవనాలను నడుపుతూ విద్యార్థులను అనేక ఇబ్బందులు కుడి చేస్తున్నారని వర్షాకాలంలో పాతబడిన గోడలు విరిగిపడే అవకాశాలు ఉన్నాయని వెంటనే వాటిని గుర్తించి రాష్ట్రంలో విద్యార్థుల్ని ఇబ్బందులకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి పాఠశాల, ఇంటర్మీడియట్ కళాశాలలో పూర్తిగా మధ్యాహ్నపు భోజన పథకాన్ని అమలు చేయడంలో చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ విద్యారంగంలో ఉన్న అనేక సమస్యలు శాశ్వత పరిష్కారాన్ని కోసం చర్చలు చేపట్టేలా ప్రభుత్వం ముందుకు వెళ్లాలని లేనిచో రాష్ట్రంలోని విద్యార్థులందరినీ కలుపుకొని ఎన్నడూ లేని విధంగా అతిపెద్ద విద్యార్థి ఉద్యమానికి తెర లేపడానికి ఏబీవీపీ వెనకాడ బోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అశోక్,జగదీష్ పాల్గొన్నారు.

విద్యను ప్రోత్సహిద్దాం...

విశాలాంధ్ర-మేదరమెట్ల: భారత్ మాతాకీ జై... విద్యను ప్రోత్సహిద్దాం... గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం అన్న నినాదాలతో ఆదివారం మేదరమిట్ల మండలం దైవాలరావూరు మారుమోగింది. దిక్కులు పిక్కటిల్లేలా విద్యార్థులు తమదైన శైలిలో నినాదాలతో హోరెత్తించారు. ఇంటింటికీ విజ్ఞాన దీపాలు వెలిగించేందుకు మా ఊరికొచ్చిన దేవత... చదువుల తల్లి సరితమ్మ అంటూ ఎస్పీ వెంట అడుగులేస్తూ ర్యాలీ నిర్వహించారు. కిరణ్‌జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ అధ్వర్యంలో దైవాలరావూరులో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ కేవీ సరిత (ఉమెన్ ప్రొటెక్షన్ సెల్, సైబర్ క్రైమ్- ఏపీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్) వివిధ అంశాలపై తమ సందేశాన్ని అందించారు. మనం బతుకుతూ ఆపదలో ఉన్నవారికి చేయూతనిస్తూ, విద్యాభివృద్ధికి ప్రోత్సాహమిస్తూ సాటివారికి సాధ్యమైనంత వరకు సాయం చేస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడాలన్న సదాశయంతో సొంత గ్రామంలో గ్రంథాలయాన్ని రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసి నిర్విరామంగా గ్రామంలో విజ్ఞాన, నైపుణ్య కాంతులు ప్రసరింపజేస్తున్న ఫౌండర్ ట్రస్టీ కందేపు రాజశేఖర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని చిన్నారులు చెప్పడం స్ఫూర్తిదాయకం. చైతన్య సదస్సులో సర్పంచ్ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

శాకాంబరి దేవిగా శ్రీలక్ష్మీ అమ్మవారు

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని నిదానంపాడు అగ్రహారంలో కొలువైయున్న శ్రీనిదానం పాటి శ్రీలక్ష్మీ అమ్మవారు ఆదివారం శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఆషాఢ మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమీషనర్, కార్య నిర్వాహణాధికారి పి.సైదమ్మబాయి ఆధ్వర్యంలో అర్చకస్వాములు అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించారు. దూర, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి దేవస్థానం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా ప్రశాంతంగా వెళ్ళి అమ్మవారిని దర్శించుకున్నారు. తొలత ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహణాధికారి సైదమ్మబాయి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి నక్షత్ర హారతి, సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది.

ఘనంగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామంలో వెంచేసియున్న శ్రీశ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా.. అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన పూజలు, అలంకరణ పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు, మహిళలు అల యాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వేళల్లో ఆలయంలో భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

మండల స్థాయిలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఉపాధ్యాయుల సర్దుబాటు మండల స్థాయిలో చెయ్యాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, ఎస్టీయూ రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏకోపాధ్యాయ పాఠశాలలు లేకుండా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. 6వేలకు పైగా వున్న స్కూల్ అసిస్టెంట్ ఖాళీలలో వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాల విద్యలో సమాంతరంగా ఇంగ్లీష్, తెలుగు మీడియం లను కొనసాగించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, 12 వ పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ నియామకం చేసి, ఐ.ఆర్ వెంటనే ప్రకటించాలని కోరారు. కస్తూర్బా స్కూల్ ఉపాధ్యాయినీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం మారి రెండు నెలలు అయినా ఇంకా ఉపాధ్యాయులపై యాప్‌ల అదనపు భారం తగ్గించలేదని అన్నారు. యాప్‌లను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు, కార్యదర్శి వడ్లన జయప్రకాష్, చిలకలూరిపేట మండల అధ్యక్షులు బొంతా రవికుమార్, ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, యడ్లపాడు మండలం అధ్యక్షులు జి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, నాదెండ్ల మండల అధ్యక్షులు షేక్ మక్బుల్ భాష, ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, సీనియర్ నాయకులు చావలి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-తాడేపల్లి : ఈ నెల 10న తాడేపల్లి ఆశ్రమం రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో జరుగుతున్న చిత్ర లేఖనం పోటీల ద్వారా బాల బాలికల్లో పట్టుదలతో పాటు జ్ఞాపక శక్తి పెరుగుతుందని బాలోత్సవాల రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ చెప్పారు. చిత్రలేఖనం పోటీలకు సంబంధించి బ్రోచర్‌ను ఆదివారం అమరావతి క్లబ్ హౌస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ బాలల అభివృద్ధి విషయమై కేంద్రీకరణే లక్ష్యంగా మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం పని చేస్తుందని, పిల్లల మనసుకు, మెదడుకు పదును పెట్టడంతో పాటు ఒకే అంశంపై దృష్టి పెట్టడం, కష్టపడటం చిత్రలేఖనం ద్వారా సాధ్యమవుతుందన్నారు. తాడేపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షులు, మంగళగిరి సిటీ కేబుల్ ఎమ్ రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ ఎంటీఎంసీ ఆధ్వర్యంలో జరిగే చిత్రలేఖనం పోటీలను జయప్రదం చేయాలని కోరారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు జరిగే సభలో తల్లిదండ్రులు, విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. విశ్రాంత ఉద్యోగి జెవి రావు, విశ్రాంత లెక్చరర్ స్వాములు, బాలోత్సవం ప్రతినిధులు గాదె సుబ్బారెడ్డి, వై.సుబ్బారావు, ఎం.సంధ్యారాణి, వై.సుధ, బిట్రా రామారావు, ఎం.మనోహర్‌రెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

వరి సాగుకు...నారుమళ్ళు సిద్ధం

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: గడిచిన రెండు సంవత్సరాలుగా సాగర్ జలాశయానికి నీరు లేక సాగర్ ఆయకట్టు పరిధిలో వరినాట్లు వేయని సంగతి విధితమే. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల మూలంగా కృష్ణానది పై ఉన్న జలాశయాలు గత కొన్ని రోజులుగా నిండుతూ నాగార్జునసాగర్ కూడా నిండుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా నీరు లేకపోవటం మూలంగా మాగాణి భూములను మెట్ట భూములుగా మార్చి సాగు చేశారు. సాగర్ ఆయ కట్టు పరిధిలో బావులు , బోర్లు కింద మాత్రమే వరి సాగు చేయడం జరిగింది. పశుగ్రాసానికి కూడా రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితి. ఒక్క దిండు వరిగడ్డి రూ.150చొప్పున కొనుగోలు చేసిన పరిస్థితి ఏర్పడింది. నీరు లేకపోవటంతో ఎకరా రూ.5000 లెక్కన కౌలుకు ఇవ్వటం జరిగింది. ప్రస్తుతం మగాణి ఎకరాకు 10 నుంచి 15 బస్తాల వరకు కౌలుకు తీసుకోవటానికి రైతాంగం సిద్ధపడుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిగా నిండు తుండటంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తిరిగి మెట్ట భూములను వరినాట్లు వేయటానికి సిద్ధం చేస్తున్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ కింద ఎక్కడికక్కడ రైతాంగం వరి నారు పోయటానికి నారుమళ్ళు సిద్ధం చేస్తున్నారు. సాగర్ జలాశయం పూరిగా నిండటంతో వరి పంట పండించడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. నాటు, వెదజల్లే పద్ధతులలో సాగుకు ఉపాక్రమిస్తున్నారు. ఈ ఏడాది పశుగ్రాసానికి కొరత లేకుండా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సోమశేఖర్ ఉద్యోగ విరమణ

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక శృంగారవనం ప్రాథమిక పాఠశాల ఎల్ ఎఫ్ ఎల్ హెచ్.ఎం కొమ్మాలపాటి సోమశేఖర్ ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవి, మక్కెన మాట్లాడుతూ కొమ్మాలపాటి సోమశేఖర్ 34 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించి ఎందరో విద్యార్థినీ విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్ది, నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు పఠాన్ అయూబ్ ఖాన్, మీసాల మురళి కృష్ణ, పివి సురేష్, పల్ల మీసాల దాసయ్య, బెజవాడ నాగేశ్వరరావు, నాగేంద్రుడు, ఎన్. వెంకటేశ్వరరెడ్డి, ఎం నరసయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి ఎంఎల్ఆర్ కృషి అభినందనీయం

విశ్రాంత ఐఎఎస్ వి చిన్న వీరబద్రుడు

విశాలాంధ్ర-రెంటచింతల: వెనుకబడిన పల్నాటి విద్యావ్యాప్తికి ఎంఎల్ఆర్ సేవాసంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని విశ్రాంత ఐఎఎస్ వి చిన్న వీరబద్రుడు అన్నారు. ఆదివారం రెంటచింతలలో జరిగిన 3 వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. మండలంలో ప్రాథమిక పాఠశాలలో పనిచేసే 30 ఉపాధ్యాయులల బోధనను వీడియో తీసి 'వారిలో 9 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వటం అభినందనీయమన్నారు. 32 కంప్యూటర్లు వివిధ పాఠశాలలకు అందజేసి సాంకేతిక విద్యావ్యాప్తికి కూడా సేవాసంస్థ ప్రయత్నిస్తుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రోత్సాహకంగా రూ.15 వేల నగదు, వ్యాసరచన పోటీలలో విజేతలైన బాల బాలికలకు రూ.8 వేల చొప్పు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ డాక్టర్ సుధ, ఎన్ఆర్ఐ మధుసూదనరెడ్డి, ఉదయ్ రెడ్డి, చిన్నమ్మ, కళ్యాణ్, మృత్యుంజయరాజ్, ప్రసాద్, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్న రామయ్య సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర వినుకొండ : వినుకొండ మండలం మక్కెన చిన్న రామయ్య సేవలు ఎనలేనివని ఆయన సేవలను వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కొనియాడారు. మక్కెన చిన్న రామయ్య 7వ వర్ధంతిని పురస్కరించుకొని పెద్దకంచర్ల, రావిచెట్టు పెద్దకంచెర్ల కాలనీ, రామయ్య స్వగ్రామం అస్సనాయుడు పాలెం గ్రామంలో ఆయన చిన్న రామయ్య విగ్రహాలకు ఆయన తనయుడు మక్కెన మల్లికార్జునరావు, ఆయన కుమారుడు డాక్టర్ మణికంఠ అల్లుళ్ళు కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యూజీసీ జాయింట్ సెక్రటరీను కలిసిన ఏఎన్‌యూ వీసీ

విశాలాంధ్ర-మంగళగిరి : న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ అవిచల్ రాజ్‌కపూర్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉప కులపతి ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఓ అకడమిక్ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు విజయవాడ లో విచ్చేసిన ఆయనతో వీసీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో ఇచ్చిన అనుమ తితో కోర్సులు నడుస్తున్నాయని, ప్రస్తుతం ఆర్ట్స్ విభాగంలో కోర్సులు మాత్రమే ఉన్నాయని, సైన్స్ కోర్సులకు దరఖాస్తులు చేసుకున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సైన్స్ కోర్సుల ద్వారా ఎక్కువ మంది విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశం ఉంటుందని ఆయనకు తెలియజేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని అందుకు నాణ్యమైన బోధన, స్టడీ మెటీరియల్, విద్యార్థి సేవలు ముఖ్య కారణమని వివరించారు. విశ్వవిద్యాలయ దూరవిద్య సేవలను విస్తృతం చేసే క్రమంలో సైన్స్ కోర్సులను త్వరిత గతిన మంజూరు చేయాలని కోరారు. అనంతరం వీసీ గంగాధర రావు రాజ్‌కపూర్‌ను దుశ్శా లువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంలో దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయల పాటి వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.రామచంద్రన్, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎన్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అవయవ తొలగింపు రహిత సమాజమే లక్ష్యం

-వాకథాన్‌లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి, డాక్టర్ విజయ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జాతీయ వాస్కులర్ డే సందర్భంగా అవయవ తొలగింపు నివారణ, రక్తనాళ(వాస్కులర్) ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించటం కోసం వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా(వీఎస్ఐ) ఆదివారం గుంటూరులో వాకథాన్‌ను నిర్వహించింది. స్థానిక ఎన్‌టీఆర్ స్టేడియం వద్ద జరిగిన ఈ వాకథాన్‌లో 500 మందికిపైగా నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వాస్కులర్ అండ్ ఎండో వాస్కులర్ సర్జన్ డాక్టర్ విజయ్ విష్ణుమొలకల మాట్లాడుతూ భారతదేశంలో డయాబెటిక్ మహమ్మారి తీవ్రతరం అవుతోందని, ఇది అవయవ తొలగింపు ముప్పును పెంచుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తుగా గుర్తించడం, నివారణ చర్యలను నొక్కి చెప్పడం ద్వారా అవయవ తొలగింపు రహిత ప్రపంచం కోసం ప్రచారం చేయటంలో ఇటువంటి కార్య క్రమాలు దోహదపడతాయన్నారు. వాస్కులర్ వ్యాధులను నివారించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయటం, సాధారణ వైద్య పరీక్షలను నిర్వహించడం వంటి బహుముఖ విధానం అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం రక్తనాళాల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

సౌజన్యకు డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ పరిశోధకురాలు పి.సౌజన్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిందని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రొఫెసర్ బి.హరిబాబు పర్యవేక్షణలో 'ఇమిడేజోలియం అయానిక్ ద్రవాలు మరియు ఎంచుకున్న సేంద్రియ ద్రావకాల మధ్య పరమాణు పరస్పర చర్యలపై అధ్యయనం' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు గాను పీహెచ్‌డీ(డాక్టరేట్) డిగ్రీని ప్రధానం చేయడం జరిగిందని అన్నారు.

నర్స్‌పై దాడి

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లిలో దారుణం చోటుచేసుకుంది. నర్స్‌గా పనిచేస్తున్న యువతి(23)పై ప్రేమోన్మాది దాడికి పాల్పడ్డాడు. వడ్డేశ్వరంలోని హాస్టల్ వద్ద బ్లేడుతో దాడి చేశాడు. ఘటనలో యువతికి గాయాలయ్యాయి. ఘటనాస్థలాన్ని తాడేపల్లి పోలీసులు పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లాకు చెందిన యువతి ఓ ప్రైవేటు వైద్యకళాశాలలో మూడేళ్లుగా నర్సుగా పనిచేస్తోంది. వైద్యకళాశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉంటూ విధులకు హాజరవుతోంది. ఆదివారం సెలవు కావడంతో చర్చికి వెళ్లి తిరిగి హాస్టల్‌కు చేరుకుంది. ఈ క్రమంలో యువతితో మాట్లాడేందుకు బందరు సమీపంలోని క్రోసూరుకు చెందిన క్రాంతి మౌళి యత్నించాడు. తాను ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకోవాలని కోరాడు. దీనికి ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన క్రాంతి మౌళి.. తన వద్ద ఉన్న బ్లేడుతో యువతి మెడపై దాడి చేశాడు. భయంతో ఆ యువకుడిని పక్కకు నెట్టే క్రమంలో ఆమె చేతిపైనా గాయాలయ్యాయి. యువకుడు పారిపోయేందుకు యత్నించగా.. స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువతిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునిక చికిత్సలపై అవగాహన ఉండాలి

దంత వైద్య నిపుణులు డాక్టర్ సయ్యద్ నజీమా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యంత : నేడు దంత వ్యాధులకు వచ్చిన ఆధునిక చికిత్సలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దంత వైద్య నిపుణులు డాక్టర్ సయ్యద్ నజీమా అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాల యంలో 'దంత వ్యాధులు-ఆధునిక చికిత్సలు'పై ఆరోగ్య సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యూష దంత వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది సహ కారంతో నిర్వహించబడిన ఉచిత దంత పరీక్షల శిబిరాన్ని దాదాపు 120 మంది అవగాహన సంస్థ సభ్యులు వినియోగించుకున్నారు. ఈ శిబిరంలో అవసరం మేరకు మందులు, బ్రష్‌లు ఉచితంగా ఇచ్చారు. ఈ ఉచిత దంత పరీక్షల శిబిరాన్ని సంబారు చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కొండా కోటిరెడ్డి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ నజీమా మాట్లాడుతూ దంతాలు ఆరోగ్య వంతంగా ఉంచుకోవడం చాలా ముఖ్యమని, దంతాలు లేకుండా ఆహారం తీసుకోవడం చాలా కష్టమన్నారు. దంతాల సహాయంతోనే ఆహారాన్ని బాగా నమిలి తినడం ద్వారా ఆరోగ్యంగా ఉండగలుగుతామని పేర్కొన్నారు. ఆహారాన్ని నమల్లేని స్థితిలో ఉంటే మనం మన శరీరానికి సరిపడా ఆహారం తీసుకోకపోవడం కాకుండా, తీసుకున్న ఆహారం కూడా సరిగా జీర్ణం కాక గ్యాస్ ట్రబుల్, అజీర్ణ లాంటి సమస్యలు ఉత్పన్నమవు తాయని, ఈ నేపథ్యంలో దంతాలు ఎప్పటికప్పుడు ఆరోగ్యకరమైన స్థితిలో ఉంచుకుంటే ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుందని ఆమె తెలిపారు. కనీసం 6 నెలలకొకసారైనా దంత వైద్యుల వద్దకు వెళ్లి దంతాలు క్లీనింగ్ చేయించుకోవాలని సూచించారు. మన పళ్ళు ఏదైనా పుచ్చినట్లు కనపడితే తొలి దశలోనే వాటిని గుర్తించి, ఎక్కువ ఇబ్బంది కాకుండా వైద్యులను సంప్రదించి తగిన వైద్యాన్ని పొందితే దంత సమస్య పెద్దది కాకుండా తక్కువలో నయమై ఆరోగ్యకరంగా మన దంతాలు ఉంచుకోగలుగుతామని తెలిపారు. దంతాలు పుచ్చిన సందర్భంలో వెంటనే డాక్టర్‌ను సంప్రదిస్తే ఆ పుచ్చును తొలగించి సిమెంట్ వేయడం లేదా క్యాప్‌ను అమర్చడం వంటి పద్ధతులు చేయడం వల్ల దంతాలు సురక్షితంగా ఉంటాయని అన్నారు. వ్యక్తి ఆరోగ్య స్థితిని బట్టి ఇంప్లాంట్స్‌ను వైద్యులు నిర్ణయిస్తారని, మన పళ్ళు కింద ఉన్న ఎముక గట్టితనాన్ని బట్టి ఏ రకమైన ఇంప్లాంట్స్ మంచిదో వైద్యులు నిర్ణయిస్తారన్నారు. చిగుర్లు బాగా సున్నితంగా ఉన్న వారు సాఫ్ట్ బ్రష్‌ను వినియోగించాలని, సాధారణంగా అందరూ మీడియం విత్ క్రాస్ బ్రెజిల్స్ ఉన్న బ్రష్‌లను వాడితే మంచిదని చెప్పారు. హార్డ్ బ్రెజిల్ ఉన్న బ్రష్‌ను వాడటం అంత మంచిది కాదని, ఆహారం తీసుకున్న ప్రతి సందర్భంలోనూ నీటితో పుక్కిలించి ఊయడం ద్వారా పళ్ళలో ఇరుక్కున్న ఆహారం బయటకు పోయి దంతాలు రక్షించబడతాయని పేర్కొన్నారు. పళ్ళకు పట్టిన గారను తొలి దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదించి క్లీనింగ్ చేయించుకోవాలని, లేని ఎడల ఆ పట్టిన గార వలన బ్యాక్టీరియా చేరి మనం ఆహారం తీసుకున్న ప్రతీసారి ఆహారంతో పాటు ఆ బ్యాక్టీరియా పొట్టలోకి చేరి రకరకాల ఇన్ఫెక్షన్లకు దారితీస్తు ందన్నారు. అవగాహన సభ్యులు డాక్టర్ నజీమాను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ఆరోగ్య ప్రచారకులు వీవీరావు ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవి యువతకు స్ఫూర్తిదాయకం

ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షులు షేక్ సుభాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు పశ్చిమ నియోజవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి రాజకీయాల్లో వచ్చే నేటి యువతకు స్ఫూర్తి దాయకం అని టీడీపీ నాయకులు, ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షులు షేక్ సుభాని అన్నారు. ఎమ్మెల్యే మాధవికి వచ్చిన నెల వారీ జీతాన్ని ప్రజలకు, సేవా కార్యక్రమాలకు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ఆది వారం టీడీపీ నాయకులు, షేక్ సుభాని కలిసి స్కూలు విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు మాధవికి అందచేశారు.

ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవి సివిల్స్ కు ప్రిపేర్ అవుతూ ప్రజలకు సేవ చేయాలని అనూహ్యంగా రాజకీయాలలోకి వచ్చి ఎన్నికలలో 50వేలపై చిలుకు ఓట్లతో గెలిచి నేడు నియోజ కవర్గంలోని అన్ని ప్రాంతాలలో ఉదయాన్నే స్కూటీపై పర్యటిస్తూ స్థానిక సమస్యలను అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యలను పరిష్కరించడాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజ కవర్గంలో నన్ను కలవడానికి వచ్చే కార్యకర్తలు విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు ఇచ్చినట్లుగానే ప్రేరణగా తీసుకొని పుష్పగు చ్ఛాలు, శాలువాలు కాకుండా ప్రజలకు లేదా విద్యార్థులకు ఉపయోగపడే వాటిని తీసుకురా వాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

గ్రామీణ పనులపై అవగాహన

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని చిర్రావూరులో ఆదివారం కేవీఎల్‌యూ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో చిర్రావూరిలోని రైతులకు గ్రామీణ పనులు, రిసోర్స్ మ్యాపింగ్, టైం లైన్, వెన్ దయాగ్రమ్ వేసి అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చిర్రావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు వీరశెట్టి శ్రీనివాసరావు, కేవీఎల్‌యూ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ బి.బాలకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ బి.రత్న ప్రసాద్, పి.అనురాధ, కె.భార్గవి, కె.స్నేహ సమీరా, డి.త్రిష, బి.వర్షిక, సీహెచ్ దివ్య, ఎస్.గాయత్రి, ఏ.ఉషా రమ్య, డి.సూసన్ జెమీమా తదితరులు పాల్గొన్నారు.

తెనాలి గ్రంథాలయానికి

పుస్తక బహూకరణ

విశాలాంధ్ర, తెనాలి : జాతీయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పుస్తక పఠన ఆవశ్యకతను వివరిస్తూ అభివృద్ధి చెందిన దేశాల్లో గ్రంథాల యాలకు అత్యధిక ప్రాముఖ్య ఇస్తారని, సమా జంలో నైతిక విలువలు, వ్యక్తుల్లో సృజనాత్మకత, ఊహశక్తి, జ్ఞాపకశక్తి, విచక్షణాజ్ఞానం, లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలనేది పుస్తక పఠనం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. వేజళ్ల వెంకట సుబ్బారావు విద్యాట్రస్టు ఆధ్వర్యంలో తెనాలి మహిళా బాలల గ్రంథాలయము, కొత్తపేట, తెనాలి గ్రంథాల యానికి గ్రంథాలయ పుస్తకాలను వేజళ్ల నవ్య బహూకరించారు. పుస్తక పఠనం వలన మానసిక వికాసముతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పెరుగుతాయన్నారు. ఆధునిక విజ్ఞానము పెరిగిన తరువాత గ్రంథాలయాలకు వచ్చిన పుస్తక పఠనం చేసే వారు తగ్గారని, అందరూ సెల్‌ఫోనల్లలోనే మునిగిపోతున్నారని అన్నారు. తెలుగు భాష కూడా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి తరాన్ని గ్రంథాలయము వైపు ఆకర్షితులను చేసి మన సాహిత్యము రాబోయే తరాలకు అందించే ప్రయత్నం చేయాలని చెప్పారు. గ్రంథాలయ అధికారి కోడూరి అంజని దాతలకు ధన్యవాదాలు తెలుపుతూ ప్రతి ఆదివారం పిల్లలకు రూం టి రీడ్ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఏ బంధానికైనా స్నేహ బంధమే పునాది అని, దానికి ఎల్లలు ఉండవని విద్యావేత్త ఇ.చంద్రయ్య అన్నారు. ఉపదవస్తే సునున్నాను అంటూ భరోసా ఇచ్చేది..కష్టం వస్తే నీకేమీకాదు అని భుజం తట్టేది ఎవరూ లేనపుడు అండగా నిలిచేది స్నేహి తుడేనన్నారు. అందుకే స్నేహం అంత గొప్పదని కొనియాడారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాల యంలో 'స్నేహితుల దినోత్సవ' కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ స్నేహం బంధుత్వం కంటే గొప్పదని, దానికి కులం లేదు, మతం, హోదా లేదన్నారు. మనం కష్టాల్లో ఉన్నపుడు నేనున్నాను అని భుజంపై చేయి వేసి మన ఆత్మస్థైర్యమై.. మనముందుండి మనల్ని తన వెనుక నడిపించే నిజమైన స్నేహితులున్న వారు అదృష్టవంతు లన్నారు. సాహితీవేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ స్నేహితులను మాత్రమే ప్రాణ మిత్రులంటామని, వారినే ప్రాణ ప్రదంగా చూసుకుంటామన్నారు. అవగాహన సంస్థ కార్యా దర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ స్నేహ స్వభావాన్ని తరుణ వయస్సు నుంచే అలవాటు చేయాలని మిత్రత్వం ప్రజల హృదయాల మధ్య వారధిగా నిలిచి మానవతా పతకాన్ని ఆవిష్క రిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సదాశివం, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నాగలింగేశ్వర స్వామిఆలయంలో ఎమ్మెల్యే మాలకొండయ్య ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర – చీరాల రూరల్ : జయంతి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయితీలోని వివిధ దేవస్థానంలలో ప్రజలు భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య గ్రామంలో కొలువై ఉన్న శ్రీ నాగలింగేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు,అర్చకులు కారంచేటి ప్రసాదరావు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందించారు. దేవస్థానం ఆవరణలో ఎమ్మెల్యే కొండయ్యకు ఘన సన్మానం చేశారు. చేనేత వృత్తి జీవనోపాధిగా చేసుకుని జీవిస్తున్న వారికి ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం వర్తింప చేయాలని,చేనేత అనుబంధ పరిశ్రమలలోని కార్మికులకు కూడా నేతన్న నేస్తం వంటి చేనేత పథకాలను వర్తింప చేయాలని,చేనేత రంగ అభివృద్ధికి చేపట్ట వలసిన చర్యల గురించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ చేనేత రంగ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తామన్నారు. చేనేత రంగం అభివృద్ధి చెందేలా తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు సిద్ది బుచ్చేశ్వర రావు,పృథ్వి లలిత మోహన్,నాసిక శివాజీ,సజ్జ రేణుక, బాలానందం, రవికు మార్, మనోహర్ రెడ్డి,ప్రసాద్,భాజపా,జన సేన పార్టీల నాయకులు,కార్యకర్తలు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - కర్లపాలెం : మోకాలు వరకు ఇన్ఫెక్షన్ వచ్చి వెంకటేశ్వర నర్సింగ్ హోం (వెంకట రమణ)లో చికిత్స పొందుతున్న కర్లపాలెం ఎం వి రాజుపాలెంకు చెందిన జాఫర్ అలీఖాన్‌కు అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్ క్రైమ్ ఆర్గనైజేషన్ డిప్యూటీ డైరెక్టర్,ఆల్ ఇండియా సూర్యవంశం న్యూస్ సీనియర్ జర్నలిస్ట్ ,ఎస్ఎఫ్ రెస్టారెంట్ అధినేత షేక్ అబ్దుల్ కరీం (ఢిల్లీ బుజ్జి) రూ.10 వేలు రూపాయలను ఆర్థికసాయంగా గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ భాషతో కలసి అందజేశారు.

వెంకటేశ్వరరావుకు సన్మానం

విశాలాంధ్ర - బాపట్ల : ఉపాధ్యాయుడిగా,చిత్రకారుడిగా,సమాజ సేవా తత్పరుడుగా బహుముఖ సేవ లందించిన ధన్యజీవి జి. వెంకటేశ్వరరావు అని వక్తలు కొనియాడారు. వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆది వారం భావపురి పుస్తకోద్యమ సమితి ఆధ్వర్యంలో ఎకో హౌస్ లో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. మానవత అధ్యక్షులు డాక్టర్ బి.శరత్ బోస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐడి డిఎస్పి గోలి లక్ష్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిత్రకారుడిగా తన సత్తా చూపి, పలు అవార్డులను గెలుచుకున్నారని తెలిపారు. సంగీత,సాహిత్య రంగాలలో కూడా తన ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డాక్టర్ పి.సి సాయిబాబు, శాఖా గ్రంథాలయ అధికారి ఎ.శివాజీ గణేషన్, రచయిత మల్లికార్జున, చిత్రకారులు తోట వెంకట నారాయణ, ఉమామహేశ్వరరావు, ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మూర్తి, భావపురి రచయితల సంఘం నాయకులు తిమ్మన శ్యామ్ సుందర్, భాగి కృష్ణ మూర్తి,కోలా సుబ్బారావు, వాసుదేవరావు, ప్రసన్నాంజనేయులు, పద్మజ, రచయిత నందిరాజు విజయకుమార్ సభా నిర్వహణ చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- వైద్య శిబిరానికి 1048 మంది హాజరు
- శస్త్ర చికిత్సకు 475 మందికి రిఫర్
- ప్రజాసేవ లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి వైద్య సేవలు

విశాలాంధ్ర - పర్చూరు : ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఇంకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం ఏడు గంటలకే ప్రజలు పెద్ద ఎత్తున క్యాంపుకు తరలివచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు మహిళలకు పురుషులకు వేరువేరుగా ప్రత్యేక ఓపికౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపుకు హాజరైన వారికి పురుషులకు మహిళలకు వేర్వేరుగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో క్యాంపు కిక్కిరిసింది. క్యాంపుకు హాజరైన వారికి ప్రత్యేక వైద్య బృందం రక్త, బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 1048 మంది హాజరు కాగా 475 మందిని శస్త్ర చికిత్సకు వైద్యులు రిఫర్ చేశారు. తొలిత స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సేవలందించడంలో ఎమ్మెల్యే సాటి లేరన్నారు. ప్రజా ఆరోగ్యం పట్ల ఒక బాధ్యతగా నెల నెలా నిరంతరం ఎమ్మెల్యే ఏలూరి కంటి వైద్య శిబిరాలు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. మచ్చలేని నాయకుడిగా సేవే పరమావధిగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి కంటి వైద్య శిబిరం ద్వారా సేవలందిస్తూ కంటి వెలుగు ప్రదాతగా ఎమ్మెల్యే నిలిచాడన్నారు. గత15 ఏళ్లుగా రాజకీయాలకతీతంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ లక్ష మందికి కంటి వైద్య శస్త్ర చికిత్సలు అందించేలా నిరంతరం క్యాంపులు నిర్వహించి చికిత్సలు చేయిస్తున్నారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలేరు రామకృష్ణ,మాజీ జెడ్పిటిసి వీరగంధం ఆంజనేయులు, నాయకులు కర్రి శ్రీనివాసరావు, సాంబయ్య,పేర్ని బాపయ్య, హనుమయ్య,బేతపూడి సురేష్, మార్కు శ్రీనివాసరావు,వెంకటేశ్వర్లు,వార్డు మెంబర్ బుదే,రమేష్ బాబు, ఈదర వెంకటేశ్వర్లు,ఇండ్ల శ్రీను, దేవతోటి నాగరాజు పాల్గొన్నారు.

అసంబద్ధ కథనాలను ప్రచురించడం తగదు

- అధికారుల నుండి వివరణ తీసుకొని వార్తను ప్రచురించాలి
- రేపల్లె డిఎస్పీ టి.మురళీకృష్ణ

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల జిల్లా భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనలో వాస్తవాలను వక్రీకరించి ఒక ప్రముఖ పత్రికలో ప్రచురించబడిన కథనం గురించిన వాస్తవాలను ఆదివారం రేపల్లె డిఎస్పి టి. మురళీకృష్ణ భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిఎస్పి మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలోని టిడిపి, వైసిపి నాయకులు పరస్పరం నిందారోపణలు చేసుకుంటూ శనివారం ఉదయం 11 గంటలకు భట్టిప్రోలు గ్రామంలోని రథం సెంటర్లో బహిరంగ చర్చా వేదిక ఏర్పాటు చేసుకున్నారు. దీంతోశాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉండడంతో భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉన్నందున ఇరువురికి అనుమతి నిరాకరించడం జరిగిందన్నారు. ఇరువురు నాయకులు వారి ఇంటి నుండి రథం సెంటర్‌కు రావద్దని సూచించడం జరిగిందన్నారు. దానికి అనుగుణంగా శనివారం భట్టిప్రోలులో ఏటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో టీడీపీ నాయకులు పార్టీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రయత్నించగా బందోబస్తు విధులలో ఉన్న ఎస్సై సాయంత్రం 6 గంటల వరకు ఆ ప్రదేశానికి వెళ్లవద్దని సూచించడం జరిగిందని తెలిపారు. ఆ సమయంలో టిడిపి నాయకుడి మొబైల్ ఫోన్ కింద పడడంతో వారి కార్యకర్త ముందుకు వంగి సెల్ ఫోన్ తీసి ఇచ్చినాడు. వీరిద్దరి మధ్యలో ఎస్సై ఉన్నారు. ఆ సమయంలో తీసిన ఫోటోను వక్రీకరించి చూపుతూ ఒక ప్రముఖ పత్రిక ఎస్సై చొక్కా పట్టుకున్న టిడిపి కార్యకర్త అను అవాస్తవ కథనాన్ని ప్రచురించడం జరిగిందన్నారు. కొన్ని పత్రికలు దానిపై పోలీస్ శాఖ నుండి వివరణ తీసుకొని వాస్తవ కథనాన్ని ప్రచురించడం జరిగిందన్నారు. ఏదైనా వార్తను ప్రచురించే సమయంలో దానికి సంబంధించిన అధికారుల నుండి వివరణ తీసుకున్న తర్వాత దానిని ప్రచురిస్తే అది సక్రమంగా ఉంటుందన్నారు. అవాస్తవ కథనాలను ప్రచురించి ప్రజలకు తప్పుడు సమాచారం అందించడం తగదన్నారు. అవాస్తవ కథనాలను ప్రచురిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో చుండూరు సిఐ,భట్టిప్రోలు,నగరం ఎస్.ఐలు పాల్గొన్నారు.

100 మందికి వైద్య సేవలు

విశాలాంధ్ర - కర్లపాలెం : శ్రీ రామకృష్ణ సేవా సమితిలో పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్,తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ ఆధ్వర్యంలో మంతెన సత్యనారాయణ రాజు సహకారంతో ఉచిత బీపీ షుగర్ వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు చల్లా రామ్మోహన్ రావు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. షుగర్ బీపీ ఉన్న వారికి పలు సూచనలు,సలహాలు అందించారు. శిబిరంకు వచ్చిన వారందరికీ అన్న ప్రసాదంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తిమ్మరాజు వెంకట సుబ్బారావు,ఉపాధ్యక్షులు ఏ.వెంకటేశ్వర్లు,ట్రెజరర్ పెనుమెత్స బాపిరాజు,వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరావు ,సనకా శ్రీనివాసరావు,బుర్ర బుల్లియ్య,తునుగుంట్ల లలిత బాబు,శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24న సామూహిక షష్ఠి పూర్తి కార్యక్రమం

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం మండలం కర్లపాలెం ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఈనెల 24వ తేదీన శనివారం 102 మందికి సామూహిక షష్టిపూర్తి కార్య క్రమం మహోత్సవం జరుగునని జిల్లా అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాసరావు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల24వ తేదీన శనివారం ఉదయం 5 గంటల నుండి గణపతి పూజ, పుణ్యాహవచనము,ఋత్విక్‌కరధన, నవగ్రహ సహిత నక్షత్ర మండపారాధన, నవ గ్రహ సహిత నక్షత్ర అధిదేవత, సహ, హోమ కార్యక్రమాలు,శ్రీ లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ నక్షత్ర హోమము,అనంతరం సామూహిక షష్టిపూర్తి కార్యక్రమం జరుగునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ప్రాంతం వారైనా షష్టిపూర్తి కార్యక్రమంలో పాల్గొనవచ్చునని వివరాలకు ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాలని జిల్లా అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాసరావు తెలియజేశారు. 9866402608, ప్రధాన కార్యదర్శి మద్దాల సంజీవరావు 9849653189, ట్రెజరర్ అచ్యుత శ్రీనివాసరావు 9290091661ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోగలరని ఆయన తెలిపారు.